సాక్షి విశాఖపట్నం
ఆదివారం । 8 । జూన్ । 2025

భక్తిశ్రద్ధలతో బక్రీద్





బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలోని ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. **అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని** శుభాకాంక్షలు చెప్పుకున్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని పేదలకు దానధర్మాలు నిర్వహించారు. త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్‌ని జరుపుకున్నామని ముస్లిం మత పెద్దలు తెలిపారు.

వన్‌టౌన్ ప్రాంతంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

యోగా సన్నాహకం అదుర్స్





అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర కార్యక్రమం సన్నద్ధతలో భాగంగా ఓం ప్రీ యోగా ఆధ్వర్యంలో 800 మంది సాధకులతో శనివారం యోగాసనాల ప్రదర్శన నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా సంస్థ నిర్వాహకుడు డాక్టర్ చిలకా వెంకట రమేష్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.

10లో

గళమెత్తారు

కౌన్సిల్‌లో కూటమి తీరును ఎండగట్టారు
ప్రజా సమస్యలపై నినదించిన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు
మేయర్‌తో పాటు పాలకపక్ష సభ్యులు ఉక్కిరిబిక్కిరి

డాబాగార్డెన్స్: కొత్త మేయర్ పీలా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన తొలి నగరపాలక సంస్థ సమావేశంలోనే అధికార కూటమికి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు చుక్కలు చూపించారు. సెంట్రల్ ఏసీ హాల్ లోనూ మేయర్‌తో పాటు పాలకపక్ష సభ్యులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ప్రజల సమస్యలపై వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు గళమెత్తడంతో, మేయర్ నీళ్లు నమలాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వ తీరును నిలదీస్తుంటే ఏం చేయాలో పాలుపోక దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. మేయర్‌గా తన తొలి సమావేశం ఏకపక్షంగా సాగేలా స్కీన్‌ప్లే రచించినా, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఎదురుదాడికి దిగడంతో మేయర్‌కు తొలి సమావేశంలో చేదు అనుభవం ఎదురైంది.

మేయర్, కూటమి సభ్యుల నాటకానికి తెర
జీవీఎంసీ కమిషనరే రాకపోతే కౌన్సిల్‌కు ఏం మర్యాద ఉంటుందని.. కచ్చితంగా రావాల్సిందేనని డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, జీవీఎంసీ వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ నేతృత్వంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు పట్టుబట్టారు. ఇన్‌చార్జ్ కమిషనర్ వచ్చేంత వరకు సభ వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. దీంతో మేయర్ పీలా శ్రీనివాసరావు కౌన్సిల్ ప్రారంభమైన 15 నిమిషాల్లోనే టీ బ్రేక్ ప్రకటించారు. ఈ సమయంలోనే జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్‌ను కౌన్సిల్‌కు పిలిపించినట్టు తెలుస్తోంది.



సాయంత్రం 4 నుంచి 7 వరకు ఇన్‌చార్జ్ కమిషనర్ ఉండాల్సిందే

ఐదు నెలలుగా జీవీఎంసీకి కమిషనర్ **లేకపోవడం దారుణమని** వైఎస్సార్ సీపీ ఫ్లోర్ **లీడర్ బాణాల శ్రీనివాస్** పేర్కొన్నారు. ఆయన **లేకుండా నిధులు మంజూరు** చేసినా ఫలితం **ఉండదన్నారు. పూర్తి స్థాయి** కమిషనర్ ఉంటేనే **అభివృద్ధి సాధ్యమన్నారు.** రెగ్యులర్ కమి**షనర్‌ను వేసేంత వరకు ఇన్**‌చార్జ్ కమిషనర్, **కలెక్టర్ హరేందిరప్రసాద్ ప్రతి** రోజూ సాయం**త్రం 4 నుంచి 7 గంటల వర**కు జీవీఎంసీలో అందుబాటులో ఉండాలని కోరారు.

పలు అంశాలపై నిలదీత..



శ్రీహరిపురంలో ఎఫ్ఆర్‌యూకి సంబంధించి మేయర్‌ను డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్ నిలదీశారు. అలాగే స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన సీనియర్ అసిస్టెంట్ వెంకట్రావు చేసిన ఫ్రాడ్‌కి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వార్డులో రోడ్డు పనులు మంజూరైనప్పటికీ ఇంతవరకు పనులు ప్రారంభించక పోవడంపై ప్రశ్నించారు.

పార్కులు కబ్జా అవుతున్నా..



పార్కులు కబ్జా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని 20వ వార్డు కార్పొరేటర్ నక్కెల లక్ష్మి కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. వార్డు పరిధి ఈస్ట్‌పాయింట్ కాలనీలో ఖాళీ స్థలాలను లెండీవనం, బాబా చావిడీ పేర్లతో కాలనీకి ఏ మాత్రం సంబంధం లేని వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని గత కౌన్సిల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఒప్పించి తాళాలు వేయించి కాలనీ వాసులకు అందజేశామన్నారు. మరుసటి రోజునే జీవీఎంసీ హార్టికల్చర్ అధికారులు వారి నుంచి తాళాలు తీసుకొని కబ్జాదారుల చేతిలో పెట్టడమేంటని ప్రశ్నించారు.

ఎఫ్ఆర్‌యూకి తాను వ్యతిరేకిని కాను..



శ్రీహరిపురంలో ఎఫ్ఆర్‌యూకి తాను వ్యతిరేకం కానని.. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున ఈ ప్రాంత ప్రజలు శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు గురవుతున్నారని, పరిశ్రమలు సామాజిక బాధ్యతగా ఉచితంగానే వైద్య సేవలందించాలని ఆ ప్రాంత కార్పొరేటర్ పీవీ సురేష్ కోరారు.

మేఘాద్రిగెడ్డ పూడికతీత చేపట్టండి



మేఘాద్రిగెడ్డలో పూడిక తీయకపోవడంతో పిల్లలు చాలా మంది స్విమ్మింగ్‌కు వెళ్లి ఆ బురదలో ఇరుక్కుపోయి మృత్యువాత పడతున్నారని, దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కోరారు. అలాగే నగరంలోని కొన్ని వార్డుల్లో వెలిగిన లైట్లు ఆరడం లేదని, ఆరిన లైట్లు వెలగడం లేదని.. వీటికి టైమర్ సిస్టమ్ పెట్టాలని సూచించారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణ



వార్డు పరిధిలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. గతంలో పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. కానీ స్పందన లేదని డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు.. మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే వార్డులో అనేక సమస్యలు ఉన్నాయి. వార్డులో మేయర్ ఒకసారి పర్యటించాలని కోరారు.

సామాజిక భవనం పూర్తి చేయండి..



వార్డు పరిధిలో సామాజిక భవనం పూర్తి చేయాలని గత నెల 12న అధికారుల దృష్టికి తీసుకొచ్చాను. చీకటి పడితే అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా ఆ ప్రాంతం నెలకొందని మొర పెట్టుకున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని కార్పొరేటర్ స్వాతిదాస్ వాపోయారు. ఇదిలా ఉండగా కోట్లు ఖర్చు పెట్టి పార్కులు అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్నా.. వాటి నిర్వహణ ఉండడం లేదని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు.

వివేకానంద కల్యాణ మండపం ఎప్పుడు ప్రారంభిస్తారు



వార్డు పరిధిలో వివేకానంద కల్యాణ మండపం వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి కోరారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

స్థానిక ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు



68 వార్డులో సమస్యలను కార్పొరేటర్ గుడివాడ అనూష లతీష్ కౌన్సిల్‌కు వివరిస్తూ.. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకొచ్చారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ నుంచి పంచవటి వరకు ప్రధాన రహదారి విస్తరణ, విశాఖ డెయిరీ కాలుష్యం, మింది, అక్కిరెడ్డిపాలెం గ్రామాల నుంచి పోర్టు రోడ్డు డ్రెయిన్‌కు కనెక్టయిన కాలువలు నిర్మించాలని, మింది తాగునీటి ట్యాంక్ నిల్వ సామర్థ్యం పెంచాలని, రామ్‌నగర్, కాశికానగర్‌లో కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. గుడివాడ అప్పన్న కాలనీలో రోడ్డు విస్తరణ పూర్తి చేయాలని కోరారు.

జనసేన నుంచి జనసేనలో చేరిక

- ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ సస్పెన్షన్ చేసిన వారంతా ...
- టీడీపీలో కొందరు గండి బాబ్జీ వ్యతిరేకులను జనసేనలో చేర్చుకున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



ఎన్నికల్లో జనసేనలో చేరిన వారిని మళ్లీ జనసేనలో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: జనసేన పార్టీ నాయకులు జనసేన పార్టీలో చేరారు.. షాకయ్యారా..అవ్వకండి.. పెందుర్తి నియోజకవర్గంలో రానున్న రోజుల్లో ఇలాంటి వింతలు మరిన్ని చూడాలి. ఏడాది క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ సస్పెన్షన్‌కు గురై.. ఎన్నికల్లో జనసేనకు పనిచేసిన నాయకులతో పాటు ఇటీవల టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీకి వ్యతిరేకంగా రాజీనామాలు చేసిన పలువురు కార్యకర్తలను జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఇప్పటికే టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ తనకు పక్కలో బల్లెంలా మారడంతో జనసేన నాయకులనే మళ్లీ అదే పార్టీలో చేర్చుకుని 'నేనే బలవంతుడిని' అని చెప్పుకోవడం కోసం రమేష్‌బాబు వెంపర్లాడుతున్నారు. కాగా కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిలో ఘోర వైఫల్యాలతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న వేళ.. ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ బలంగా ముందుకు అడుగులు వేస్తున్న సమయంలో.. 'వాపు'ని బలం అని చెప్పుకోవడానికి కూటమి ముఖ్య నేతలు ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడడం విడ్డూరంగా ఉందని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

వారే వీరు..
పెందుర్తి నియోజకవర్గంలో ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులుగా ఉన్న కొంత మంది సబ్బవరం మండలానికి చెందిన నాయకులు పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడ్డారు. అందులో అమృతపురం ఎంపీటీసీ సభ్యుడు సింగంపల్లి శ్రీనివాసరావుతో పాటు పలువురిని వైఎస్సార్‌సీపీ 2024 ఎన్నికల ముందే సస్పెండ్ చేసింది. దీంతో వారంతా జనసేన జెండాలు పట్టుకుని తిరిగారు. వారితో పాటు నారపాడు ఎంపీటీసీ, సబ్బవరం-2 ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, సబ్బవరం-3 ఎంపీటీసీ సబ్బవరపు శ్రీను తదితర నాయకులు కూటమి అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పంచన చేరారు. శనివారం సబ్బవరంలో జరిగిన కార్యక్రమంలో వారందరికీ మళ్లీ కండువాలు వేసి జనసేనలో చేర్చుకోవడంతో సభకు హాజరైనవారే అవాక్కయ్యారు.

ఎమ్మెల్యే పల్లాకు పితృ వియోగం



సీతంపేట: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలం శనివారం మధ్యాహ్నం సీతంపేటలోని తన స్వగృహంలో స్వర్గస్తులయ్యారు. పల్లా సింహాచలం విశాఖ-2 ఎమ్మెల్యేగా, వుడా బోర్డు సభ్యులుగా పనిచేశారు. గాజువాక అంటే పల్లా సింహాచలంగా పేరును సార్థకం చేసుకున్నారు. ప్రజాసేవకుడిగా, సీనియర్ రాజకీయ నాయకుడిగా విశాఖ జిల్లా వాసులకు సుపరిచితుడు. విశాఖ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా పలువురు గుర్తుచేసుకున్నారు. ఆయన మరణం టీడీపీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆదివారం తెల్లవారు 5 గంటల వరకు సీతంపేటలోని ఆయన స్వగృహంలో పార్థివదేహం అందుబాటులో ఉంటుందని, అనంతరం కొత్త గాజువాకలోని పూర్వపు ఇంటి వద్దకు తరలిస్తారు. ఉదయం 9 గంటల తరువాత అంత్యక్రియలు ప్రారంభమవుతాయి. పల్లా సింహాచలం పార్థివ దేహానికి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, కార్మిక శాఖా మంత్రి సుభాష్, మాజీ మేయర్ గొలగాని హరివెంకట కుమారి, శ్రీనివాస్ దంపతులు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, వుడా ఛైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ తదితరులు నివాళులర్పించారు.



పల్లా సింహాచలం పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మేయర్ హరి వెంకట కుమారి

12న సీనియర్ అథ్లెట్ల జట్టు ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: ఏపీ స్టేట్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపికను ఈనెల 12న నిర్వహించనున్నారు. రైల్వే అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో ఈ ఎంపికలు నిర్వహించనున్నామని విశాఖ అథ్లెటిక్ సంఘం కార్యదర్శి నారాయణరావు తెలిపారు. 18 ఏళ్లు నిండిన అథ్లెట్లు ఆయా అంశాల్లో పోటీపడవచ్చని.. 2007 జూన్ 27 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. స్టేట్ మీట్ ఈనెల 14, 15వ తేదీల్లో గుంటూరు నాగార్జున వర్సిటీలో జరగనుంది.

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి




డీఈవో చాంబర్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు, డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేత

ఆరిలోవ: ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. జీవీఎంసీ పదో వార్డు పరిధి తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు సమావేశమయ్యారు. ఆదివారం చేపట్టనున్న డీఈవో కార్యాలయం ముట్టడిని ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యాయులంతా విజయవంతం చేయాలని కోరారు. అక్కడ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులంతా చేతులు కలిపి ముట్టడికి సంఘీభావం తెలిపారు. అనంతరం అక్కడ నుంచి నాయకులు డీఈవో కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ డీఈవో చాంబర్‌లో బైఠాయించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, సమస్యలు పరిష్కంచాలని, ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టాలని, వెబ్ ఆప్షన్ పెట్టవద్దని నినాదాలు చేశారు. అనంతరం ఆదివారం చేపట్టనున్న డీఈవో కార్యాలయం ముట్టడికి సంబంధించిన నోటీస్‌ను డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డి.గోపీనాథ్, ఇమంది పైడిరాజు, సీహెచ్.వేణుగోపాల్, టి.రామకృష్ణ, టి.ఆర్ అంబేడ్కర్, అరుణ్‌కుమార్, ధనుంజయ, చిన్నారావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ముగుస్తుండటంతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు తరలివచ్చారు. భక్తులతో దర్శక క్యూలు, కేశఖండనశాల, అన్నప్రసాద భవనం, ప్రసాద విక్రయశాల కిక్కిరిశాయి. అధిక సంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లు రావడంతో ట్రాఫిక్ స్తంభించింది. కాగా శనివారం ఒక్కరోజే దేవస్థానంలోని అన్ని విభాగాల ద్వారా సుమారు రూ.51 లక్షల ఆదాయం సమాకూరింది.



సింహగిరిపై భక్తుల రద్దీ

నగర పరిశుభ్రత అందరి బాధ్యత

అమెరికన్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్

కొమ్మాది: నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంలో స్వచ్ఛంద సేవకుల(వలంటీర్ల) సేవలు అవసరమని అమెరికన్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ అన్నారు. రుషికొండ బీచ్‌లో శనివారం ఆంధ్ర విశ్వవిద్యాలయం, అమెరికన్ కార్నర్ సంయుక్తంగా నిర్వహించిన 'కమ్యూనిటీ డే'లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వలంటీర్లతో కలిసి సాగర తీర ప్రాంతంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. బీచ్‌లో ఉన్న వ్యర్థాలను సేకరించారు.



వలంటీర్లతో కలిసి పాల్గొన్న జెన్నిఫర్ లార్సన్

పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని.. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈ.ఎస్.ధనుంజయరావు మాట్లాడుతూ బీచ్ పరిసరాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వలంటీర్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏయూ క్రీడా విభాగం సంచాలకుడు ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్.హరినాథ్, అమెరికా కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ పబ్లిక్ డిప్లొమసీ అధికారి ఎమిలియా స్మిత్ తదితరులు పాల్గొన్నారు.



రుషికొండ బీచ్‌లో చెత్తను తొలగిస్తున్న జెన్నిఫర్ లార్సన్, ఏయూ వీసీ రాజశేఖర్

నేటి నుంచి అంధ మహిళల క్రికెట్ టోర్నీ

ఉక్కునగరం: ఉక్కునగరం మరోసారి స్ఫూర్తిదాయక క్రీడా సంబరానికి వేదిక అవుతోంది. దృష్టి లోపం ఉన్న మహిళల అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం నుంచి స్టీల్‌ప్లాంట్‌లో ప్రారంభం కానున్నట్లు అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఆంధ్రప్రదేశ్, క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ కేరళ సంయుక్తంగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నాయి. ఉక్కు స్టేడియంలో నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో ఢిల్లీ, ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్ జట్లు తలపడనున్నాయి. దృష్టి లోపం ఉన్న క్రీడాకారిణులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, క్రీడల్లో రాణించడానికి ఈ టోర్నమెంట్ ఒక అద్భుతమైన అవకాశమని అజయ్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్టీపీసీ సింహాద్రి సహకారంతో జరుగుతున్న ఈ పోటీల ఫైనల్స్ ఈ నెల 11న జరుగుతాయి. ఈ సమావేశంలో టోర్నమెంట్ కో–ఆర్డినేటర్లు వై.అమ్మి నాయుడు, ఎల్.నరేష్ పాల్గొన్నారు.

చదివేద్దాం.. ఓ గాంధీ పుస్తకం

- బాపు ఒక చరిత్ర కాదు.. జీవన పాఠం
- ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'గాంధియానా' ఏర్పాటు
- మహాత్ముని జీవిత విశేషాల పుస్తకాల ప్రత్యేక విభాగం


మహాత్మా గాంధీ జీవితానికి సంబంధించిన పుస్తకాలు


ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'గాంధియానా రిఫరెన్స్' బుక్స్ విభాగం

సీతంపేట: జాతిపిత మహాత్మా గాంధీ స్వాతంత్య్ర సమరయోధుడు మాత్రమే కాదు.. 20వ శతాబ్దంలో మానవాళిని అత్యధికంగా ప్రభావితం చేసిన మహోన్నత వ్యక్తి. సత్యం, అహింస అనే సిద్ధాంతాలను ఆయుధాలుగా మలిచి, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం వంటి మార్గాలతో రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారు. ఆయన చూపిన మార్గం ప్రపంచానికి ఒక కొత్త పాఠాన్ని నేర్పింది. గాంధీజీ ఆశయాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో 'గాంధియానా' పేరిట ప్రత్యేక పుస్తక విభాగాన్ని ఏర్పాటు చేశారు. గాంధీజీ చరిత్ర, జీవితం అపురూపం. ఆయన పోరాటం, సిద్ధాంతాలు, ఆశయాలపై వేలాదిగా పుస్తకాలు ప్రచురించగా.. వాటిలో సుమారు వెయ్యి వరకు పుస్తకాలు దాతల నుంచి సేకరించి ఇక్కడ అందుబాటులో ఉంచారు.

గాంధీజీ గురించి ఎందుకు చదవాలి?

గాంధీజీ జీవిత చరిత్ర, ఆయన పోరాట స్ఫూర్తి గురించి ప్రతి ఒక్కరూ తప్పక తెలుసుకోవాలి. ముఖ్యంగా విద్యార్థి దశలోనే గాంధీజీ గురించి చదివితే నైతిక ప్రవర్తన అలవడుతుంది. తల్లిదండ్రుల పట్ల గౌరవం, పేదవారికి సహాయం చేయాలనే గుణం, దేశభక్తి వంటి సుగుణాలు పెంపొందుతాయి. తద్వారా విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగుతారు. వివేకంతో కూడిన విద్యను అభ్యసించి, మెరుగైన సమాజ నిర్మాణానికి దోహదపడతారు. అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం, శరీరశ్రమ, నిర్భయత్వం, సర్వమత సమభావం, స్వదేశీ, అస్పృశ్యతా నివారణ అనేవి గాంధీజీ పాటించిన ఏకాదశ వ్రతాలు. మత సామరస్యం, అస్పృశ్యతా నివారణ, మద్యపాన నిషేధం, ఖాదీ, గ్రామ పరిశ్రమలు, మౌలిక విద్య, పారిశుధ్యం ఆరోగ్య నియమాలు, ప్రాంతీయ భాషాభివృద్ధి, వయోజన విద్య, స్త్రీ సాధికారత, జాతీయ భాష, ఆర్థిక సమానత్వం, రైతు సంక్షేమం, కార్మిక సంక్షేమం, ఆదివాసుల వికాసం, కుష్టు రోగుల సేవ తదితరవి మహాత్ముడు అవలంబించారు. వీటన్నింటి గురించి తెలుసుకునేందుకు గాంధీజీకి సంబంధించిన పుస్తకాలు చదివేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి. స్వామి వివేకానంద చెప్పినట్లు 'క్యారెక్టర్, కరికులమ్, కల్చర్' అనే మూడింటిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలి.

వేల పుస్తకాలు.. కోట్ల ప్రతులు

ముంబయిలోని సర్వోదయ మండల్, గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్లు గాంధీజీపై వచ్చిన సుమారు 7 వేల పుస్తకాలను సేకరించి భద్రపరిచాయి. గాంధీజీ స్థాపించిన నవజీవన్ ట్రస్ట్ ఆయన ఆత్మకథ 'సత్యశోధన'ను 17 భారతీయ భాషలతో పాటు ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, ఇటాలియన్, కొరియన్, జపనీస్, చైనీస్ భాషల్లో ప్రచురించింది. కోటికి పైగా గాంధీజీ ఆత్మకథ పుస్తకాలు అమ్ముడయ్యాయంటే అతిశయోక్తి కాదు.

తప్పక చదవాల్సిన కొన్ని పుస్తకాలు

ది స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్(సత్యశోధన), గాంధీ: ది ఇయర్స్ దట్ ఛేంజ్‌డ్ ది వరల్డ్(రామచంద్ర గుహ), గాంధీ బిఫోర్ ఇండియా(రామచంద్ర గుహ), ఇండియా ఆఫ్టర్ గాంధీ(రామచంద్ర గుహ), మై డియర్ బాపు(సి.రాజగోపాలాచారి గాంధీజీకి రాసిన లేఖలు), ది గుడ్ బోట్‌మ్యాన్(రాజమోహన్ గాంధీ), గాంధీ: ప్రిజనర్ ఆఫ్ హోప్(జుడిత్ ఎం. బ్రౌన్), ది డెత్ అండ్ ఆఫ్టర్‌లైఫ్ ఆఫ్ మహాత్మా గాంధీ(మకరంద్ పరాంజపే), హింద్ స్వరాజ్ లేదా ఇండియన్ హోమ్ రూల్(గాంధీ–1909), ఐయామ్ గాంధీ(బ్రాడ్ మెల్జర్), మై డేస్ విత్ గాంధీ(నిర్మల్ కుమార్ బోస్), ది లైఫ్ ఆఫ్ మహాత్మాగాంధీ(లూయిూ ఫిషర్), ఎ వీక్ విత్ గాంధీ(లూయిూ ఫిషర్), మహాత్మా గాంధీ: హిజ్ లైఫ్ అండ్ ఐడియాస్(చార్లెస్ ఎఫ్. ఆండ్రూస్, అరుణ్ గాంధీ), ది మ్యాన్ బిఫోర్ ది మహాత్మ(చార్లెస్ డిసాల్వో), ది లివింగ్ గాంధీ: లెసన్స్ ఫర్ అవర్ టైమ్స్(తారా సేథియా), గాంధీ అండ్ మావో ఇన్ క్వెస్ట్ ఆఫ్ అనాలజీ(రతన్ దాస్), గాంధీ సీఈవో(అలాన్ ఆక్సెల్‌రాడ్)


నైతిక విలువలు పెరుగుతాయి



గాంధీజీ గురించి చదవడం వల్ల నైతిక ప్రవర్తన అలవడుతుంది. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే గాంధీజీ గురించి చదవాలి. కనీసం ఆయన ఆత్మకథ 'ది స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్'పుస్తకాన్ని అయినా చదవాలి. కళాశాలలో చేరేటప్పుడు ప్రతి విద్యార్థికి యాజమాన్యం గాంధీజీ ఆత్మకథ పుస్తకాన్ని అందజేయాలి. ఏడాది చివరలో నాన్ క్రెడిట్ (మార్కులతో నిమిత్తం లేకుండా) పద్ధతిలో పరీక్ష నిర్వహించి ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చూడాలి. దీని వల్ల ప్రతి ఒక్కరిలో నైతిక విలువలు పెరుగుతాయి. ఇలా చేస్తే మెరుగైన సమాజం ఏర్పడటానికి దోహదపడిన వారవుతారు. అలాగే సచివాలయ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులకు వారం, పది రోజుల పాటు శిక్షణ ఇవ్వడం ద్వారా గాంధీజీ సిద్ధాంతాలు, ఆశయాలపై అవగాహన కల్పించవచ్చు. దీని వల్ల వారిలో అంకితభావం పెరుగుతుంది.

– ఆచార్య వి.బాలమోహన్‌దాస్, గాంధీ సెంటర్ అధ్యక్షుడు

గాంధేయవాదం ఆదర్శం



గాంధేయవాదం అన్ని కాలాలకు, అన్ని సమాజాలకు వర్తించే మహత్తర భావన. యువత వ్యక్తిత్వ వికాసానికి గాంధీజీ ఆలోచనలు, ఆశయాలు ఎంతగానో దోహదపడతాయి. ఆయన ఆశయాలు భావితరాలకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతోనే పౌరగ్రంథాలయంలో 'గాంధియానా రిఫరెన్స్'పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. గాంధీ సెంటర్ వ్యవస్థాపకుడు కె.ఎస్.శాస్త్రి బహూకరించిన వందలాది అమూల్యమైన పుస్తకాలు యువతకు దిశానిర్దేశం చేయగలవు. ఇవి కేవలం అలనాటి జాతీయోద్యమ చరిత్రనే కాక, సామాజిక రుగ్మతలపై గాంధీజీ సాగించిన పోరాటాన్ని, ఆయన సంస్కరణ దృక్పథాన్ని ఈ తరం వారికి స్పష్టం చేస్తాయి. గాంధీ గురించి ఏ సమాచారం అయినా ఈ పుస్తకాల్లో లభిస్తుంది.

– డి.వి.సూర్యారావు, రచయిత

అయ్యో పాపం!

- నిద్రపోతున్న కూలీని గమనించని లారీ డ్రైవర్
- నల్ల పిక్కలో కూరుకుపోయి దుర్మరణం
- మూడు రోజుల తర్వాత వెలుగుచూసిన విషాద ఘటన


మృతుడు సూరన్నదొర(ఫైల్)


వివరాలు సేకరిస్తున్న సీఐ సతీష్‌కుమార్, సర్కిల్‌లో సూరన్న చేయి భాగం

పెందుర్తి: ఓ నిర్మాణ కూలీ జీవితం నిద్రలోనే కడతేరింది. తాను పనిచేస్తున్న చోటే సేద తీరుతుండగా విధి చిన్నచూపు చూడటంతో ఊపిరాడక అసువులు బాశాడు. పెందుర్తి మండలం ముదపాకలోని జగనన్న కాలనీలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పెందుర్తి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి. విజయనగరం జిల్లా తెర్లాం మండలం నందబలగ గ్రామానికి చెందిన పక్కి సూరన్నదొర (57), గంగమ్మ దంపతులు కుటుంబంతో కలిసి ముదపాకకు వలస వచ్చి ఇక్కడి జగనన్న కాలనీలో నిర్మాణ పనులు చేస్తుంటారు. సూరన్నదొర అన్న కుమారుడు పక్కి ప్రసాద్ ఈ నెల 4న ఇదే ప్రాంతంలో బావిలో పడి మృతి చెందాడు. ఈ క్రమంలో ప్రసాద్ మృతదేహం పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు వెళ్లిన సూరన్న.. నీరసంగా ఉండటంతో ముదపాకలోని ఇంటికి తిరిగి వచ్చేశాడు. తీవ్ర విషాదంలో ఉన్న సూరన్న ముదపాకలోనే ఉన్న బంధువులతో అదే రోజు సాయంత్రం మద్యం సేవించాడు. ఉదయం మళ్లీ కేజీహెచ్‌కు వెళ్లి మృతదేహంతో ఊరికి వెళతానని చెప్పాడు. అనంతరం సమీపంలో నిర్మాణం కోసం పోసి ఉన్న నల్ల పిక్క రాశిపై పడుకున్నాడు. అయితే అర్ధరాత్రి అక్కడికి పిక్క వేసేందుకు వచ్చిన లారీ డ్రైవర్ సూరన్న నిద్రిస్తున్న విషయాన్ని గమనించకుండా అతనిపైనే అన్‌లోడ్ చేసేశాడు. అప్పటికే గాఢ నిద్రలో ఉన్న సూరన్నదొర ఊపిరాడక మరణించినట్లు పోలీసులు భావిస్తున్నారు.

మూడు రోజుల తర్వాత వెలుగులోకి...

కేజీహెచ్‌కు వెళతానని చెప్పిన సూరన్న కనిపించకపోవడంతో విజయనగరం వెళ్లిపోయాడని అందరూ భావించారు. కానీ అతను అక్కడికి కూడా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ప్రసాద్ అంత్యక్రియలు నిర్వహించకుండా చాలాసేపు ఎదురుచూశారు. చివరకు ఆ కార్యక్రమం పూర్తి చేసుకున్న కుటుంబ సభ్యులు గురువారం తిరిగి ఇక్కడికి వచ్చి సూరన్న ఆచూకీ కోసం ఆరా తీశారు. ఈ క్రమంలో అతను అదృశ్యమైనట్లు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేద్దామని నిర్ణయించుకున్నారు. అయితే శనివారం ఉదయం కాలనీలో నిర్మాణ పనుల కోసం నల్ల పిక్కను తరలించేందుకు పొక్లెయిన్‌తో లారీలకు లోడ్ చేస్తున్నారు. ఆ సమయంలో నల్ల పిక్క రాశి నుంచి ఓ చేయి బయటకు కనిపించడం, ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా దుర్వాసన రావడంతో ఆందోళనకు గురైన పొక్లెయిన్ ఆపరేటర్ విషయాన్ని కాలనీవాసులకు, గ్రామస్తులకు తెలిపాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయగా, అది సూరన్నదొరదేనని కుటుంబ సభ్యులు గుర్తించారు. ప్రాథమిక విచారణ చేపట్టిన సీఐ కె.వి.సతీష్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనను అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏడాది కిందట రైలు ప్రమాదంలో సూరన్న కుమారుడు, మూడు రోజుల కిందట ప్రమాదవశాత్తు బావిలో పడి అతని అన్న కుమారుడు మృతి చెందడంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబంలో.. ఈ తాజా విషాదం చోటుచేసుకోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

యోగాంధ్రలో భాగస్వాములు కండి


యోగాసనాలు వేయిస్తున్న రమేష్

ఎంవీపీకాలనీ: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 21న నిర్వహించే యోగాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలని విశాఖ ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పిలుపునిచ్చారు. యోగాంధ్ర సన్నద్ధతలో భాగంగా ఓం ప్రీ యోగా ఆధ్వర్యంలో 800 మంది సాధకులతో శనివారం యోగాసనాల ప్రదర్శన నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా సంస్థ నిర్వాహకుడు డాక్టర్ చిలకా వెంకట రమేష్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అతిథులతో పాటు సాధకులతో రమేష్ యోగాసనాలు వేయించారు. సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, గాదిరాజు వర్మ, ఓం ప్రీ యోగా అధ్యక్షుడు కె.శాంతారాం, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, ఆయుష్ విభాగ అధికారి ఝాన్సీ, శ్రీ విశ్వం గ్రూప్ ధర్మరాజు, తమేర మల్టీస్పెషల్ స్కిన్ క్లినిక్ నిర్వాహకులు వెంకటరమణ, శాంతి తదితరులు పాల్గొన్నారు.



బతుకు బండి

రెక్కల కష్టమే అతని పెట్టుబడి. భార్య తోడే తనకు కొండంత అండ. తమ దుకాణాన్ని ఈ రెండు చక్రాల బండిపైకి ఎక్కించి.. ఊరూరా తిరుగుతూ బతుకుబండిని లాగిస్తున్నాడీ శ్రామికుడు. వెనుక మోయలేనంత సామాన్లు, ముందు తన అర్ధాంగి.. మధ్యలో తను.. రేపటిపై ఆశతో ముందుకు సాగిపోతున్నాడు. బతుకుపోరాటంలో ఒకరికొకరు తోడుగా నిలుస్తున్నారు. ఈ చిత్రం వారి అన్యోన్యతకు, జీవన పోరాటానికి నిలువుటద్దం.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారంధర	: రూ.95
బ్రాయిలర్ (లైవ్)	: రూ.115
స్కిన్	: రూ.200
స్కిన్‌లెస్	: రూ.210

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	535.00
విజయనగరం	539.00
శ్రీకాకుళం	539.00

వీసీబీ నికర లాభం రూ.71.77 కోట్లు

- ఈ ఏడాది మరో 5 కొత్త బ్రాంచీలు
- బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు


మాట్లాడుతున్న బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

సీతంపేట: ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్(వీసీబీ) ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.71.77 కోట్ల నికర లాభం ఆర్జించి 110వ వార్షికోత్సవం ఘనంగా జరుపుకుంటోందని బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. ద్వారకానగర్‌లోని బ్యాంకు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ బ్యాంకు 55 బ్రాంచీలతో 1,11,593 మంది సభ్యులను కలిగి ఉందన్నారు. వీసీబీలో షేరు ధనం రూ.389.55 కోట్లు కాగా, డిపాజిట్లు రూ.4354.73 కోట్లు, రుణాలు రూ.3436.47 కోట్లుగా ఉన్నట్టు తెలిపారు. రుణాల్లో 95 శాతం కోటి రూపాయల కంటే తక్కువ మొత్తం అందజేశామన్నారు. సామాన్యులకు ప్రాధాన్యమిస్తూ 1.30 లక్షల మంది రుణగ్రహీతల అవసరాలకు తగినట్టు సేవలందించినట్టు తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి దాదాపు 7,800 కోట్లకు ఆర్థిక లావాదేవీలు చేరుకున్నట్టు వెల్లడించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి 8,600 కోట్లు లక్ష్యంగా, ఈ ఏడాది మరో 5 కొత్త శాఖలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వివరించారు. నాన్ షెడ్యూల్ హోదాలో ఉన్న తమ బ్యాంకుకు షెడ్యూల్ హోదా కల్పించేందుకు వీలుగా ఆర్‌బీఐకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఆదివారం మద్దిలపాలెంలోని కాకతీయ ఫంక్షన్ హాలులో జరగనున్న 110వ మహాసభలో డివిడెండ్ ప్రకటించనున్నట్టు తెలిపారు. సమావేశంలో బ్యాంక్ డైరెక్టర్లు సూరపనేని నాగభూషణ చౌదరి, ఏజే స్టాలిన్, నామన కామరాజు, వి.చంద్రశేఖర్, జె.వి.సత్యనారాయణమూర్తి, గుళ్లపల్లి జనార్ధనరావు, సి.హెచ్.ఆదినారాయణ శాస్త్రి, సీఈవో వి.వి.వి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రొజెక్టర్ పెయింటింగ్

యోగాంధ్రలో భాగంగా విశాఖ రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో గోడలపై ప్రొజెక్టర్‌తో చిత్రకళాకారులు పెయింటింగ్ వేస్తున్నారు.

– ఫొటోలు: సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



